Sakshi

# 'సుప్రీం' జడ్జీలుగా లాయర్లపై

# పరిమితి తొలగింపు!

**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టుకు, 24 హైకోర్టులకు జడ్జీల నియామకానికి సంబంధించిన విధి విధానాల ముసాయిదా పత్రంలో మార్పులు చేయాలంటూ సుప్రీం కోర్టు కొలీజియం చేసిన డిమాండ్లలో కొన్నిటికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. సుప్రీంకు నియమించే జడ్జీల, న్యాయకోవిదుల సంఖ్యను గరిష్ఠంగా మూడుగా పేర్కొంటూ విధించిన పరిమితిని తొలగించాలన్న డిమాండ్‌కు సమ్మతించింది. అలాగే.. జడ్జీల పదోన్నతుల్లో సీనియారిటీనే ప్రధాన అర్హతగా పరిగణించేందుకూ ఆమోదం తెలిపింది. ఈ మేరకు విధివిధానాల పత్రాన్ని సవరిస్తూ ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్.ఠాకూర్‌కు ప్రభుత్వం లేఖ పంపించింది. అయితే.. కొన్ని కీలక నిబంధనలపై సర్కారు కఠినవైఖరినే కొనసాగించింది. ముఖ్యంగా.. కొలీజియం సిఫారసు చేసిన ఏ పేరునైనా జాతీయ భద్రత, ప్రజాప్రయోజనం ప్రాతిపదికగా తిరస్కరించే హక్కు ప్రభుత్వానికి ఉండాలని పట్టుపట్టింది. ఈ నిబంధనను కొలీజియం తిరస్కరించడం తెలిసిందే. సర్కారుకు ఈ హక్కు ఉండటమంటే న్యాయవ్యవస్థ విధినిర్వహణలో జోక్యం చేసుకోవటమే అవుతుందని అభ్యంతరం తెలిపింది. ఈ విషయంలో తన వైఖరిని సడలించని సర్కారు.. కొలీజియం చేసిన సిఫారసులో ఏ పేరునైనా తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను కొలీజియానికి వివరిస్తామని సవరించిన ముసాయిదాలో పేర్కొంది.

**సుప్రీం కోర్టుకు ఆర్టీఐ వర్తిస్తుందా?**

సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద సుప్రీంజడ్జీల నియామకం, ఇతర న్యాయ సంబంధ వివరాలను దరఖాస్తుదారుడికి ఇవ్వొచ్చో, లేదో తేల్చాలంటూ సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనాన్ని కోరింది.